

వైసీపీ ప్రభుత్వంలో రోడ్లు, మురుగునీటి కాల్వలు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు రోడ్ల విస్తరణ, కాల్వలపై ప్రత్యేక దృష్టిపెట్టి నిధులు పుష్కలంగా అందిస్తున్నారు. ఇందులో భాగంగా ముద్దనూరు పట్టణంలో రోడ్డు విస్తరణ, మురుగునీటి కాల్వల పనులు చేపడుతున్నారు. ఈ అభివృద్ధి పనుల్లో రాజకీయ నాయకులు స్వలాభం కోసం పాకులాడుతుండటంతో అడ్డదిడ్డంగా కొలతలు వేయడమే కాదు.. అడ్డదిడ్డంగా పనులు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అడ్డదిడ్డంగా కొలతలు పనులు



మసీదు వద్ద ప్రమాదకర మలుపులో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

- కాల్వల ఏర్పాటుతో ఇరుకైన రోడ్డు
- నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు విస్తరణ పనులు
- ప్రధాన రహదారులు అస్తవ్యస్తం

ముద్దనూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు పట్టణంలోని నాలుగు రోడ్ల నుంచి జమ్మలమడుగు రోడ్డులోని శివాలయం వరకు నేషనల్ హైవే పరిధిలో ఉంది. ఈ రోడ్డును రూ.9 కోట్ల నేషనల్ హైవే నిధులతో విస్తరిస్తున్నారు. ఇందులో భాగంగా రోడ్డు విస్తరణతో పాటు ఇరువైపులా దాదాపు 2కిలోమీటర్ల మేర కాల్వ, విద్యుత్, మంచినీటి పైపులైను ఏర్పాటు చేయాల్సి ఉంది. రోడ్డు విస్తరణ పనుల ప్రారంభానికి ముందు జిల్లా సర్వేయర్‌తో కొలతలు వేయించాల్సి ఉండగా మండల సర్వేయర్‌తో వేయించారు. దీంతో కొలతల్లో తేడా వచ్చిందన్న విమర్శలు వస్తున్నాయి. ఇక రోడ్డుపక్కన కాల్వల ఏర్పాటుతో రోడ్డు వెడల్పు చాలా తగ్గిపోయింది. ప్రభుత్వ స్థలం లేదంటూ ప్రధానమైన పాత బస్టాండు మలుపులో రోడ్డు పైనే కాల్వ ఏర్పాటు చేశారు. దీంతో జమ్మలమడుగు రోడ్డు వైపు భారీ వాహనాలు మలుపులో తిరగాలంటే చాలా కష్టం.

ఒకవైపు మాత్రమే..

పాత బస్టాండు మలుపు నుంచి రైల్వే గేట్ల వరకు రోడ్డుకు ఇరువైపులా కాల్వలు రావాల్సి ఉండగా ఒక వైపు మాత్రమే ఏర్పాటు చేశారు. ఒకటిన్నర కిలోమీటరుకు పైగా మూడు కాల్వల నుంచి వచ్చే నీటిని 250 మీటర్ల కాల్వలో వెళ్లే విధంగా కలుపుతున్నారు. ఇక కాల్వ ఎత్తు రోడ్డు కన్నా తక్కువగా వేస్తున్నారు. సాధారణంగా కాల్వను రోడ్డుకన్నా ఎత్తు పెంచి దానిని ఫుట్‌పాత్‌గా వాడుతుంటారు. ఇక్కడ మాత్రం రోడ్డుకన్నా తక్కువ ఎత్తులో కాల్వపైన మూత వేస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా..

మసీదు మలుపు వద్ద రోడ్డులోనే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ మలుపు వద్ద మూడుసార్లు లారీలు ఇళ్లలోకి దూసుకు రావడంతో భారీ నష్టం వాటిల్లింది. కాల్వ ఏర్పాటు పనుల్లో కాంట్రాక్టర్‌కు అవగాహన లేదన్న విమర్శలు వస్తున్నాయి. రోడ్డు క్రాసింగ్ వద్ద వీధులకు దారిలేకుండా పనులు చేస్తున్నారు. ఒకేసారి చాలా వీధులకు వెళ్లే దారుల వద్ద గుంతలు తీస్తున్నారు. మసీదు వద్ద పాత ఊరిలోకి వెళ్లే దారిలో మోరీని బ్రేక్ చేసి 10 రోజులు కావస్తోంది. ఇప్పటి వరకు అక్కడ ఎటువంటి పనులు చేయలేదు. దీంతో ఈ మార్గంలో తవ్విన కాల్వపై వేసిన రేకుమీద నడవలేక విద్యార్థినులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు పోకుండా యజమానుల నుంచి నాయకులకు భారీగా ముడుపులు అందినట్లు ప్రజలు గుసగుసలాడుతున్నారు. సంబంధిత జిల్లా అధికారులు జిల్లా సర్వేయర్‌తో కొలతలు వేయించి ప్రభుత్వ స్థలం వెలికితీయాలని, ప్రభుత్వ నిధులు వృధాకాకుండా అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డును తవ్వి ఏర్పాటు చేస్తున్న కాల్వమీద వేసిన రేకులపై నుంచి దాటుతున్న విద్యార్థినులు



రోడ్డు కంటే తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన కాల్వ వాల్‌ను పరిశీలిస్తున్న నేషనల్ హైవే అధికారులు

స్థలం ఉన్నంతలో విస్తరణ

రెవెన్యూ అధికారులతో రోడ్డు కొలతలు వేయించాం. వారు చూపిన మేరకు ప్రభుత్వ స్థలం ఎంత ఉందో అంతలో విస్తరణ పనులు చేస్తున్నాం. పాత బస్టాండు మలుపులో రోడ్డు కన్నా కాల్వ తక్కువలో ఉండటంతో కాల్వ ఎత్తు పెంచుతున్నాం.

\- విశ్వనాథ్, ఏఈ, ఎన్‌హెచ్

మా భూములు ఇప్పించండి

- జాతీయరహదారిపై బైఠాయించిన దళితులు
- ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న దళితులు



ఒంటిపై పెట్రోలు పోసుకొని నిరసన తెలుపుతున్న వ్యక్తి

బద్వేలుటౌన్/గోపవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): "రెక్కాడితే కానీ డొక్కాడని జీవితాలు మావి.. మా భూములే కావాల్సి వచ్చాయా.. మా భూములు మాకు ఇప్పించండి" అంటూ మడకలవారిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన ప్రజలు బుధవారం జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని చెదరగొట్టే ప్రయత్నం చేయగా ఓ వ్యక్తి ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా..

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె ఎస్సీకాలనీకి చెందిన 24 దళిత కుటుంబాలకు 1972లో ఒక్కొక్కరికి 2.50 ఎకరాల వంతున సర్వేనెంబర్ 1754 నుంచి 1764 వరకు 60 ఎకరాల భూమిని జెడ్‌హెచ్‌డీసీ ద్వారా ఇచ్చారు. అప్పట్లో ఎస్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద ఈ భూములను అభివృద్ధి చేసి బోర్లు వేయించారు. అయితే బోర్లు ఇంకిపోవడంతో పాటు కొంతమంది స్థోమత లేక తమ భూములను బీళ్లుగానే ఉంచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇది గమనించిన వైసీపీ నాయకులు జగనన్న స్మార్ట్‌సిటీ పేరుతో కొంత భూమిని కబ్జా చేశారు. దీనిపై దళితులు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదు. అప్పట్లో టీడీపీ నాయకులు దళితులకు మద్దతు పలికారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులు ఆ భూములను ఎంఐజీ స్మార్ట్‌సిటీకి ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో దళితులు అక్కడ పనులను నిలుపుదల చేయాలంటూ బుధవారం జాతీయ రహదారిపైన బైఠాయించారు. బాధితులలో ఒకరు ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు. ఈ విషయంపై గోపవరం రెవెన్యూ అధికారులను వివరణ కోరగా వైసీపీ ప్రభుత్వంలో శ్రీనివాసపురం సమీపంలో నిరుపయోగంగా ఉన్న దాదాపు 34ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి అక్కడ స్మార్ట్‌సిటీ ఏర్పాటు కోసం అనుమతులు జారీ చేశారన్నారు. అప్పట్లో దళితులు నిరసన తెలపడంతో అక్కడ భూములు కోల్పోయిన వారికి గోపవరం ప్రాజెక్ట్ కాలనీ వద్ద, బేతాయిపల్లె సమీపంలో భూములను మంజూరు చేస్తామని, ప్రొవిజన్ సర్టిఫికెట్లు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ అధికారి సురేశ్



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ అధికారి సురేశ్

కడప కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు అవకాశాలను అందిపుచ్చుకుని సామాజికంగా, ఆర్థికగా ఎదగాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ అధికారి ఎస్.సురేశ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ, జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.సురేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని కోరారు. ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్సీ, ఎస్టీ యూనిట్లన్నీ రీయింబర్స్‌మెంట్ పథకాలలో ఉన్నాయని వీటిని ఉపయోగించుకుని లబ్ధి పొందాలన్నారు. పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలన్నారు. అలాగే ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధన్, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, జాతీయ ఎస్సీ ఎస్టీ హబ్ సభ్యులు వసంత్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికలు

- జడ్పీ సీఈవో ఓబులమ్మ



మీడియాతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఓబులమ్మ

కడప రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జడ్పీ సీఈవో సి. ఓబులమ్మ తెలిపారు. బుధవారం జడ్పీలోని తన చాంబర్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ఎన్నికల ప్రక్రియను కొనసాగిస్తున్నామన్నారు. ఆగస్టు 12వ తేదీ పోలింగ్, 13న రీపోలింగ్, 14న ఓట్ల లెక్కింపు, తదుపరి ఫలితాలను వెల్లడిస్తామన్నారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 45 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో 35,207 ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు.

తొలిరోజు 5 నామినేషన్లు

ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఎన్నికలకు తొలిరోజు బుధవారం 5 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైసీపీ 2, కాంగ్రెస్ 2, జనసేన నుంచి ఒకరు నామినేషన్లు వేశారు. ఆయా అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను జడ్పీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.ఓబులమ్మకు అందజేశారు. కాగా.. జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో జడ్పీ కార్యాలయలో ఎలక్షన్ వింగ్‌ను ఏర్పాటుచేశారు. ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ స్థానాల నామినేషన్లు స్వీకరించడానికి వేరు వేరు విభాగాలను ఏర్పాటుచేశారు. బుధవారం నుంచి జడ్పీలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో ఇక్కడ పోలీసులకు ఎన్నికల విధులు కేటాయించారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

కడప కలెక్టరేట్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత గురువారం జిల్లాకు రానున్నారు. గురు, శుక్రవారాల్లో రెండురోజుల పాటు ఆమె పర్యటించనున్నారు. గురువారం ఉదయం 11-30 గంటలకు పులివెందులలోని టీడీపీ కార్యాలయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు జమ్మలమడుగుకు చేరుకుంటారు. ఆగస్టు 1న జమ్మల మడుగులో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన నిమిత్తం ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సమీక్షించనున్నారు. రాత్రికి కడపలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని బస చేస్తారు. శుక్రవారం జమ్మలమడుగులో సీఎం చంద్రబాబునాయుడుతో పాటు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు.

రేపు సీఎం చంద్రబాబు రాక

- గూడెం చెరువులో పింఛన్ల పంపిణీ



(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం జిల్లాకు రానున్నారు. జమ్మలమడుగు మండలంలోని గూడెంచెరువులో పింఛన్లను పంపిణీ చేయనున్నారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక విమానంలో కడప విమానాశ్రయానికి 11.45 గంటలకు చేరుకుంటారు. 11.55కు హెలిక్యాప్టరులో బయల్దేరి జమ్మలమడుగులోని పాలిటెక్నిక్ కళాశాలకు 12.15కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 12.25కు గూడెంచెరువుకు చేరుకుంటారు. 12.45 వరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందిస్తారు. 12.50కి గూడెంచెరువులోని ప్రజావేదిక వద్దకు చేరుకుంటారు. 2గంటల వరకు ఆ కార్యక్రమం సాగుతుంది. 2 నుంచి 2.30 వరకు విశ్రాంతి తీసుకుంటారు. 2.30కి బయల్దేరి 2.35కు ఫంక్షన్‌హాలుకు చేరుకుని 3.35 వరకు అక్కడ కేడరుతో సమావేశం అవుతారు. 3.55కు హెలిక్యాప్టరులో బయల్దేరి 4.05గంటలకు గండికోట చేరుకుంటారు. అక్కడ ఓబెరాయ్ హోటల్, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. గండికోటలోనే సమావేశం నిర్వహిస్తారు. 5.30 గంటలకు గండికోటలో బయల్దేరి 5.50కి కడప విమానాశ్రయం చేరుకుంటారు. 6గంటలకు కడప నుంచి గన్నవరం బయల్దేరుతారు.అయితే సీఎం పర్యటన షెడ్యూల్‌ని అధికారికంగా ఇంకా ప్రకటించలేదు.

APK క్లిక్ చేస్తే
- లింక్ టచ్ చేస్తే.. డేటా సైబర్ నేరగాళ్ల చేతిలోకే
- అప్రమత్తంగా లేకపోతే క్షణాల్లో ఖాతా ఖాళీ

7

మృతుని కుటుంబానికి ఎన్ఆర్ఐ చేయూత
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

సీఎం సభకు ముమ్మర ఏర్పాట్లు



గూడెంచెరువులో సీఎం సభాప్రాంగణం వద్ద జరుగుతున్న ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

- పరిశీలించిన కలెక్టర్

జమ్మలమడుగు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గూడెంచెరువు సర్కిల్ వద్ద నుంచి సభాప్రాంగణం వరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు తొలగించి ఎర్రమట్టి చల్లారు. టిడ్కో గృహాల వెనుక భాగంలో ముఖ్యమంత్రి సభాప్రాంగణానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గూడెంచెరువును బుధవారం సాయంత్రం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సందర్శించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఆయనతో పాటుఎస్పీ అశోక్‌కుమార్, ఆర్డీవో సాయిశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రకాశ్‌బాబు, డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు. అనంతరం గూడెంచెరువు గ్రామంలో పీ4 సర్వేలో భాగంగా గుర్తించిన బంగారు కుటుంబాల వారితో కలెక్టర్ మాట్లాడారు. అక్కడి నుంచి టిడ్కో గృహాలకు వెనుకభాగంలో ఏర్పాటు చేస్తున్న సభాప్రాంగణం వద్దకు చేరుకున్నారు. అక్కడున్న అధికారులతో ఏర్పాట్లపై కలెక్టర్ చర్చించారు. జమ్మలమడుగు తహశీల్దారు శ్రీనివాసరెడ్డి, సర్వేయర్లు సభాప్రాంగణం ఏర్పాట్ల గురించి మ్యాపు ద్వారా కలెక్టర్‌కు వివరించారు. గూడెంచెరువులో సీఎం పాల్గొన్న అనంతరం గండికోటలో ఆ ప్రాంత అభివృద్ధికి సంబంధించి సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తారని, అక్కడ కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, పొన్నతోట శ్రీనివాసులు, నవనీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన హెలిప్యాడ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను బుధవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పరిశీలించారు.

కడప నగరంలో ఫుడ్‌కోర్టు

- స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ పేరుతో.. ఒకేచోట 100 దుకాణాలు
- రూ.4.5 కోట్లు కేటాయించిన ప్రభుత్వం



కలికిరి / కడప, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఫుడ్‌కోర్టు ఏర్పాటు కానుంది. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ పేరుతో ఒకేచోట 100 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. పట్టణాలు, నగరాల్లో ప్రస్తుతం వీధి వ్యాపారాలు చికాకు కలిగించే వ్యవహారాలుగా తయారయ్యాయి. ప్రధానంగా స్ట్రీట్ ఫుడ్ నిర్వహణ రద్దీ ప్రాంతాలు, పక్కనే మురుగునీటి కాలువలు, దోమలు, ఈగల మధ్య ఆహార పదార్థాల శుభ్రత ప్రశ్నార్థకం చేశాయి. దీనిక పరిష్కారంగా కేంద్రం 'దీన దయాల్ అంత్యోదయ యోజన- నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ సపోర్ట్ టు అర్బన్ స్ట్రీట్ వెండర్స్' పేరుతో పట్టణ వీధి వ్యాపారాలను క్రమబద్ధం చేసేందుకు పూనుకుంది. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలో మూడు మున్సిపల్ కార్పొరేషన్‌లను ఎంపిక చేయగా అందులో కడప నగరానికి చోటు దక్కింది. దీనిలో భాగంగా కడప నగరంలో వీలైనంత వరకూ ఒకే చోట మొత్తం 100 వ్యాపారాలకు చోటు కల్పించనుంది. దీనికి అవసరమైన స్థలాన్ని స్థానిక కార్పొరేషన్ సమకూర్చడంతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించనుంది. ఎలాంటి రద్దీ లేకుండా విస్తారమైన ప్రదేశంలో ఒక క్రమ పద్ధతిలో వీటిని ఏర్పాటు చేస్తారు.

లబ్ధిదారుల ఎంపిక ఇలా..

18 సంవత్సరాలు వయసు పైబడిన మహిళలందరూ అర్హులే. అయితే మున్సిపల్ కార్పొరేషన్‌లో వీధి వ్యాపారులుగా నమోదై ఉండాలి. వీధి వ్యాపారానికి సంబంధించిన గుర్తింపు కార్డు, వ్యాపార ధ్రువపత్రం కార్పొరేషన్ జారీ చేసినదై ఉండాలి. నగరానికి చెందిన టౌన్ వెండింగ్ కమిటీ ధ్రువీకరణ తప్పనిసరి. లబ్ధిదారులను గుర్తించేందుకు మెప్మా సిబ్బంది నగరంలో సర్వే నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో పాటు దరఖాస్తులు సేకరిస్తారు. లబ్ధిదారుల ఎంపిక తరువాత జాబితాను ప్రదర్శిస్తారు. చివరగా షాపులను లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. వంద షాపుల ఏర్పాటుకు మొత్తం రూ.4.50 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.2.90 కోట్లు స్థానిక కార్పొరేషన్ సమకూరుస్తుంది. స్వయం సహాయ సంఘాలకు బ్యాంకులు రూ.1.50 కోట్లు అందజేస్తాయి. మెప్మా నుంచి రూ.10 లక్షలు అందుతుంది. లబ్ధిదారులకు అవసరమైన శిక్షణ కూడా ఉంటుంది. వ్యాపార లావాదేవీలన్నీ డిజిటల్ విధానంలోనే కొనసాగుతాయి. ఇందుకు స్మార్ట్ మార్కెట్లో ఉచిత వైఫై సదుపాయాన్ని కల్పిస్తారు. ఈ మేరకు వివిధ మార్గదర్శకాలతో మున్సిపల్ వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.



రుచిగా.. శుచిగా..

● డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలు తీరుపై అన్ని వర్గాల సంతృప్తి ● క్యారియర్లు తెచ్చుకోవడం లేదంటున్న విద్యార్థులు



కోడిగుడ్లు, చిక్కీలు తీసుకుంటున్న విద్యార్థులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభం రోజు నుంచే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ పూర్తిగా మార్చి వేసింది. దీంతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో రుచిగా, శుచిగా వండిన అన్నం వడ్డిస్తున్నారు.



భోజనం చేస్తున్న విద్యార్థినులు

సుండుపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 70 ప్రాథమిక పాఠశాలలుండగా, సుమారు 3 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదువు కుంటున్నారు. వారందరికీ క్రమం తప్పకుండా మెనూ ప్రకారం భోజనం అందించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుండడంపై ఉపాధ్యాయులతోపాటు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని రుచి చూస్తున్నారు. పాఠశాలలను సందర్శించే ఉన్నతాధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులను సైతం భోజనం రుచి చూడాలని ఉపాధ్యాయులు, వంట మనుషులు కోరుతున్నారు.

భోజనం క్యారియర్లు బంద్

గత ప్రభుత్వంలో నాణ్యమైన బియ్యం సరఫరా, సకాలంలో వంట ఏజెన్సీలకు నిధులు మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు నాణ్యమైన భోజనం అందేది కాదు. దాంతో పలు పాఠశాలల్లో విద్యార్థులు ఇంటినుంచి క్యారియర్లలో భోజనం తెచ్చుకునేవారు. ప్రస్తుతం బడిలో పెట్టే భోజనం నాణ్యతతో పాటు రుచిగా సైతం ఉండడంతో ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకోవడం మానేశామని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పేరిట నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యతగా ఉండడంతో విద్యార్థులు ఇష్టపడి తింటున్నారు. అందుకే ప్రస్తుతం ఇంటి నుంచి క్యాయర్లు తెచ్చుకోవడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

హాజరుశాతం పెరుగుతోంది

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం వసతి ఉంది. దీంతో విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం అందించే సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకుని చదువులోనూ రాణించాలి.

- రవీంద్రనాయక్, మండల విద్యాశాఖ అధికారి-2

కడుపునిండా తింటున్నాం..



గతంలో భోజనం తింటున్నా తృప్తి ఉండేది కాదు. ఇప్పుడు మేలు రకం బియ్యంతో వండి పెడుతున్నారు. దాంతో కడుపునిండా తింటున్నాం. ఇంట్లో భోజనం చేసిన అనుభూతి పొందుతున్నాము.

- అయాస్, షోయబ్, విద్యార్థులు

చాలా బాగుంది



గతంలో దొడ్డు బియ్యంతో చేసిన అన్నం పెట్టేవారు. ముద్దగా ఉండటంతో సరిగ్గా తినలేకపోయేవాళ్లం. ఇప్పుడు సన్న బియ్యంతో రుచిగా వండి పెడుతున్నారు. వారానికి ఐదు రోజులు కోడిగుడు, మూడు రోజులు చిక్కీ ఇస్తున్నారు.

- పార్వతీదేవి, 8వ తరగతి



సాంఘికశాస్త్ర క్లబ్...
సామాజిక చైతన్యానికి దిక్సూచి కావాలి

● విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు పెంపొందించాలి ● డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు

రాయచోటిటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించి వారిని చైతన్యవంతమైన పౌరులుగా సాంఘిక శాస్త్ర క్లబ్ తీర్చిదిద్దాలని డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు సూచించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేతాజీ సాంఘికశాస్త్ర క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చరిత్ర, రాజకీయ, భౌగోళిక శాస్త్రం, ఆర్థిక వ్యవస్థలపై అవగాహన పెంపొందించేలా క్లబ్ పని చేయాలన్నారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేందుకు,విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు దోహదపడే కృత్యాధార బోధనకు క్లబ్ తోడ్పడాలన్నారు. అనంతరం ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాల అభివృద్ధికి క్లబ్ తోడ్పడాలన్నారు. పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా సమకాలీన సామాజిక సమస్యలపై అవగాహన కల్పించేలా క్లబ్ తన సేవలను అందించాలన్నారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ సమాజంపై ప్రభావం చూపగలిగే చైతన్యవంతమైన పౌరులను తయారు చేయడమే క్లబ్ ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు బోధనాంశాల్లో క్లబ్ సహకరిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో ఈ క్లబ్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, విద్యార్థులు దానిని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటసుబ్బారెడ్డి, శివభాస్కర్, గిరిబాబుయాదవ్, శ్రీనివాసులు, శివప్రసాద్, కేదర్నాథ్, ఉషామాధురి, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు
నివేదికలు సిద్ధం చేయండి

● సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు ఎంత భూమి అవసరం, ఎంత పెట్టుబడి పెట్టాలి, ఎంతమంది కార్మికులు కావాలి తదితర అంశాలపై నివేదికలు ఇవ్వాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సూచించారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ చాంబర్‌లో వ్యవసాయ మార్కెటింగ్, హార్టికల్చర్, ఇండస్ట్రియల్, వ్యవసాయ శాఖాధికారులతో సబ్‌కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మదనపల్లె మార్కెట్‌ను పరిశీలించి అప్పట్లో అధికారులతో సమావేశం నిర్వహించారన్నారు. ముఖ్యంగా టమోట ధరలు పడిపోయి, గిట్టుబాటు కూడా రాని సమయంలో రైతులను ఆదుకోవడంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారన్నారు. ఇందులో భాగంగా రెండో సారి సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. టమోట గుజ్జు పరిశ్రమను డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాలచే నిర్వహించడంపై ఆలోచించాలన్నారు. కుటీర పరిశ్రమగా గుజ్జు పరిశ్రమలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మదనపల్లె టమోట మార్కెట్ విస్తీర్ణం తక్కువగా ఉండటం వలన సీజన్‌లో ఎక్కువ సంఖ్యలో లారీలు వస్తే ఇబ్బందులు వస్తున్నాయని, టమోటా మార్కెట్‌ను పట్టణం వెలుపలకు మార్చేందుకు, ఎంత భూమి అవసరం ఉంటుందో అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఉద్యానశాఖ జిల్లా అధికారిణి సుభాషిణి, హెచ్‌వో ఈశ్వరప్రసాదరెడ్డి, మార్కెట్ కార్యదర్శి జగదీశ్, అభిలాష్, ఏవో నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు తహసీల్దార్ల భూబాగోతం!

● అక్రమ మ్యుటేషన్లు, వెబ్‌ల్యాండ్‌లో నమోదుపై విచారణకు జేసీకి ఆదేశాలు

కలికిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలంలో పనిచేసిన ఇద్దరు తహసీలార్ల భూభాగోతంపై జాయింట్ కలెక్టరును విచారణాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కలసపాడు మండలంలోని కలసపాడు, శంకవరం, మామిళ్ళపల్లె గ్రామాల్లోని వివిధ సర్వే నంబర్లలోని 45.94 ఎకరాల డీకేటీ భూములను ఆరుగురి పేరుతో వెబ్‌ల్యాండ్‌లో నమోదు నమోదు చేసినట్లు ప్రధాన ఆరోపణ. అప్పట్లో తహసీల్దారుగా పనిచేసిన ఎం.మోహన్ (ప్రస్తుతం రిటైర్డు), ఆ తరువాత ఇన్‌చార్జీ తహసీల్దారుగా వ్యవహరించిన డిప్యూటీ తహసీల్దారు ఎస్.నాగవాహిణిలు కుట్రపూరితంగా వ్యవహరించినట్లు పలు ఆరోపణలు వచ్చాయి. దీనిపై అప్పటి బద్వేలు డివిజన్ ఆర్డీవో విచారణ రికార్డులను పరిశీలించి 2022 డిసెంబరు 10 నివేదిక సమర్పించారు. అక్రమాలకు పాల్పడ్డ తహసీల్దార్లపై చర్యలు తీసుకోవలసిందిగా ఆర్డీవో సిఫారసు చేశారు. 2023 జనవరి 26న కలెక్టరు ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వానికి నివేదించారు. ఈ నివేదికల ప్రకారం పెద్దిరెడ్డి పురుషోత్తం రెడ్డి, పెద్దిరెడ్డి సావిత్రి పేర్లతో 21.22 ఎకరాలు, పెద్దిరెడ్డి మునిరెడ్డి, పెద్దిరెడ్డి లక్ష్మీదేవి పేర్లతో 15.92 ఎకరాలు, పెద్దిరెడ్డి పెద్దవెంకటసుబ్బారెడ్డి పేరుతో 4.90 ఎకరాలు, పెద్దిరెడ్డి హైమవతి పేరుతో 3.90 ఎకరాల డీకేటీ భూములను నిబంధనలను అతిక్రమించి ఇద్దరు తహసీల్దార్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసినట్లు ఈ నివేదికలు తేల్చాయి. ప్రతి సర్వే నంబరును ఏ తేదీన, ఏ తహసీల్దారు, ఎవరి పేరుతో మ్యుటేషన్ చేసి వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసినట్లు పూర్తి వివరాలతో వెల్లడించారు. డీకేటీ రిజిస్టరులో నంబర్లను తారుమారు చేయడం, అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా తదుపరి కార్యాచరణకు పూనుకోవడం తీవ్రమైన చర్యగా పేర్కొన్నారు. ఈ నివేదికల ఆధారంగా 2023 జూన్ 16న తహసీల్దార్లు మోహన్, నాగవాహినిలకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. పది రోజుల్లోగా వివరణలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. 2024లో ఇరువురూ తమ వాదనలను ప్రభుత్వానికి సమర్పించారు. వీటితో ఏకీభవించని ప్రభుత్వం ఈ మొత్తం వ్యవహారంపై విచారణకు ఆదేశిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జాయింట్ కలెక్టరును విచారణాధికారిగా నియమించారు. నెల రోజుల్లోగా విచారణ పూర్తిచేసి నివేదిక ప్రభుత్వాని పంపాల్సిందిగా జేసీకి సూచించారు. విచారణలో జేసీకి సహకరించడానికి బద్వేలు ఆర్డీవోను ప్రెజెంటింగ్ అధికారిగా కూడా నియమిస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి జి.జయలక్ష్మి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

చీనీ, నిమ్మ మొక్కలు పంపిణీకి సిద్ధం



చీనీ, నిమ్మ మొక్కలకు అంటు కడుతున్న కూలీలు

రైల్వేకోడూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యాన మోడల్ నర్సరీలో రైతులకు అందుబాటులో నాణ్యమైన చీనీ, నిమ్మ మొక్కలు ఉన్నట్లు బుధవారం రైల్వేకోడూరు ఉద్యాన శాఖ నర్సరీ అధికారి బి. లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో చీనీ, నిమ్మ తోటలలో చీడపీడల ఉధృతి పెరగడంతో సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతోందన్నారు. ఈ సమస్యను అధికమించడానికి రైతులకు మేలైన, నాణ్యమైన మొక్కలను ప్రభుత్వ నర్సరీల నుంచి కొనుగోలు చేయాలని రైతులకు తెలిపామన్నారు. మొక్కల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించాలని, చీనీలో అయితే రంగాపూర్ మీద అంటు కట్టిన రెండు నుంచి రెండున్న అడుగుల ఎత్తు కల్గి, నాలుగైదు ఆరోగ్యకరమైన కొమ్మల నుంచి రెండున్నర నుంచి మూడున్నర సెంటీమీటర్ల మందం కలిగిన మొక్కలను ఎంపిక చేసుకోవడం వలన చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడులను పొందవచ్చునని తెలిపారు. ఉద్యాన రైతులకు నాణ్యమైన మొక్కలను అందించే ఉద్దేశంతో ఉద్యాన శాఖ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఏపీ మోడల్ నర్సరీలో రంగాపూర్ మొలకలపై కట్టిన 80 వేల చీనీ మొక్కలు, 15 వేల నిమ్మ మొక్క లు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఒక్కో చీని మొక్క రూ. 55లు, నిమ్మ మొక్క రూ. 25కు ఇవ్వనున్నామని తెలిపారు. ఉపాధిహామీ పథకం కింద మొక్కలను ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఉద్యానశాఖాధికారుల సలహాలు, సూచనలు పాటించి నాణ్యమైన మొక్కలను ఎంపిక చేసుకొని సాగు చేయడం ద్వారా సుమారు 30 ఏళ్ల వరకు కూడా చీని, నిమ్మ చెట్ల ద్వారా రైతులు దిగుబడులు సాధించాలని ఆశిస్తున్నామని తెలిపారు.

స్పందనలో ఫిర్యాదు చేశారని దాడి



మాట్లాడుతున్న తెలుగు యువత నేత ఆంజనేయులునాయుడు

సుండుపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్పందనలో ఫిర్యాదు చేశామని అరుణ్‌కుమార్, మరికొంత మంది తమపై దాడి చేశారని తెలుగు యువత పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆంజనేయులు నాయుడు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. జీ. రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలో నకిలీ పించన్లతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని, సర్వే నెంబర్ 731-4లో గల ప్రభుత్వ భూమి (గయాలు) ఆక్రమణ కు గురవుతోందని, జూలై 7 న స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. బుధవారం కొలతల కోసం రెవెన్యూ అధికారులు రావడంతో అక్కడికి వెళ్లిన తమపై దాడి చేశారన్నారు. గ్రామస్తులతో పాటు బయటి ప్రాంతాల నుండి మనసులను తీసుకువచ్చి దాడికి యత్నించారన్నారు. దీంతో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌బాబునాయుడు, కిరణ్ నాయుడు, కోనంకి రమణ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారత

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ● మహిళా సంఘాల సభ్యులకు గుడ్లు విక్రయించే బండ్ల పంపిణీ



గుడ్ల బండిని అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్

రాయచోటి కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారత సాధ్యమైందని, మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం 50 వేల రూపాయల విలువైన గుడ్ల అమ్మకపు బండిని జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నమయ్య జిల్లాలోని ఎంపిక చేసిన పది మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు 10 బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంతోనే మహిళా సాధికారత సాధ్యమైందన్నారు. మహిళా సంఘాలు అభివృద్ధి చెందడానికి చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారని ఆ కృషి ఫలాలను నేడు రాష్ట్రంలోని స్వయంసహాయ సంఘాల ద్వారా మహిళలందరూ పొందుతున్నారన్నారు. ప్రస్తుతం అందజేసిన గుడ్ల అమ్మకపు బండ్లు పౌష్టికాహారంతో పాటు గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కలిగిస్తాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు పౌష్టికాహారాన్ని అందుబాటులోకి తేవడం, గ్రామీణ ప్రజలకు జీవనోపాధి కలిగించడం అనే రెండు లక్ష్యాలతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం, జాతీయ గుడ్డు సమన్వయ కమిటీతో కదుర్చుకున్న అవగాహన ఒప్పందం మేరకు ఈ బండ్లు పంపిణీ చేశారు. ఈ ఒప్పందం ప్రకారం 2025-26 సంవత్సరంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు మొత్తం 1000 ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని ఒక్కొక్క సభ్యురాలికి ఒక గుడ్డు అమ్మకపు బండి చొప్పున మొత్తం 1000 ు బండ్లను సరఫరా చేయనున్నారన్నారు. మొదటి దశలో అన్నమయ్య జిల్లాకు 10 బండ్లు కేటాయించగా, వీటిని ఈ రోజు లబ్దిదారులకు అందజేశామన్నారు. ఈ లబ్దిదారులకు గుడ్లతో చేసే రకరకాల వంటకాలపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం శిక్షణ ఇస్తుందని, దీంతో అదనంగా దాదాపు 20,820 రూపాయల లబ్ది చేకూరనుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ డీఆర్‌డీఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల శాంతి కల్యాణం

● హనుమంతుడిపై రాముడి నగరోత్సవం



సీతారాముల శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, జూలై 30: పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవచేశారు. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ మండపంలో ఊంజల్‌సేవ, రాత్రికి మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సీతారాముల శాంతి కల్యాణం చేశారు. చివరగా ముస్తాబైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడిని హనుమంత వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రమేష్, ఆగమ అడ్వైజర్ శ్రీనివాసాచార్యులు, వేదపండితులు కృష్ణప్రసాద్, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు. అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, గోకుల్, భాషికాచార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పట్టాభిషేక మహోత్సవాల్లో నేడు..

రాముడి పట్టాభిషేక మహోత్సవాలలో గురువారం ఉదయం స్నపన తిరుమంజనం, రాముడి పట్టాభిషేకం, ఊంజల్‌సేవ, రాత్రికి గరుడవాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

రామాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో స్కూటర్‌పై వెళుతున్న దంపతులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కడప ఐటీఐకి చెందిన మహబూబ్‌బాషా తన భార్య మహబూబ్ జాన్‌తో కలసి స్కూటర్‌పై కడప నుంచి రాయచోటికి వెళుతుండగా గువ్వలచెరువు బస్టాండు సమీపంలో లారీ ఢీకొంది. సమాచారం అందుకున్న రామాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడినవారిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జమ్మలమడుగు డీఎల్డీవోగా రామాంజనేయులు

కలికిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డివిజనల్ డెవల ఎమెంట్ అధికారిగా వి.రామాంజనేయులును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 జనవరి 17న ఆయన అనంతపురం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా డిప్యుటేషన్‌పై వెళ్లిన ఆయనను మాతృ సంస్థకు పంపుతూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరు ఉత్తర్వులిచ్చారు. దీంతో రామాంజనేయులు పోస్టింగ్ కోసం పంచాయతీ రాజ్ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని పరిశీలించిన ప్రభుత్వం రామాంజనేయులును జమ్మలమడుగు డీఎల్డీవోగా నియమిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.



ఉపాధిహామీ నిధులతో నిర్మించిన గోకులం షెడ్

గోకులాల్లో.. గోల్‌మాల్!

● బినామీ పేర్లతో అనర్హులకు..
● ఉపాధిహామీ పనుల్లో భారీగా అవినీతి ..
● సామాజిక తనిఖీలో బహిర్గతమయ్యేనా ?

పాడి రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న గోకులాల నిర్మాణాల్లో అవినీతి పేరుకుపోయింది. రైతుల పేరుతో అనర్హులకు మంజూరు చేయడంతోపాటు, నిధులను ఇతరులు ఖాతాలోకి మళ్లించి స్వాహా చేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుర్రంకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలానికి ఉపాధిహామీ పథకం కింది 58 గోకులం షెడ్లు మంజూరు కాగా 55 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ షెడ్లను పాడి రైతులకు మాత్రమే కేటాయిం చాల్సి ఉండగా, పలువురు అనర్హులు సొంతం చేసుకు న్నారు. ఈ విషయాన్ని ఉపాధిహామీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇ లాంటివారు గోకులాల నిర్మాణంలో ప్రభుత్వం నిబంధనలు అతిక్రమించినా, పూర్తి స్థాయిలో బిల్లులను చెల్లించినట్లు రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక తనిఖీ బృందం పనులను తనిఖీ చేయనుండడంతో అవినీతికి పాల్పడిన సిబ్బంది తమను కాపాడాలంటూ రైతులు, నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో సామాజిక తనిఖీ బృందం ఉపాధి పనులను నిష్పక్షపాతంగా తనిఖీ చేసి అవినీతి, అక్రమాలను వెలికితీయాలని కూలీలు, రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏపీవో జయరామిరెడ్డి మాట్లాడుతూ గోకులాల షెడ్లను పాడి రైతులే నిర్మించుకున్నారు. బినామీ పేర్లతో గోకులాలను నిర్మించుకున్నట్లు తమ దృష్టికి రాలేదన్నారు. అలా ఎవరైనా బినామీ పేర్లతో గోకులాలను నిర్మించుకుని ఉంటే తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వైవీయూ వీసీ కోసం సెర్చ్ కమిటీ ఏర్పాటు

కలికిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడప యోగి వేమన యూనివర్శిటీకి వైస్ చాన్సలర్ నియామకం కోసం ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ (సెలెక్షన్ కమిటీ)ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీసీ నియమాకం కోసం అర్హతలు కలిగిన ముగ్గురు పేర్లను సూచించాల్సిందిగా సెర్చ్ కమిటీని ప్రభుత్వం కోరింది. ప్యానల్ సభ్యుల పేర్లను ప్రాధాన్యత ప్రకారం అక్షర క్రమంలో పేర్కొని జాబితాను ప్రభుత్వానికి అందజేయాల్సిందిగా కమిటీని కోరింది. సెర్చ్ కమిటీ సిఫారసులను తదుపరి వీసీ నియామకం కోసం గవర్నరుకు ప్రభుత్వం పంపాల్సి ఉందని తెలిపింది. సెర్చ్ కమిటీలో ప్రభుత్వ నామినీగా ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పి. జార్జి విక్టర్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా రాయలసీమ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎ.వి. ప్రసాద్ రావు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నామినీగా సిమ్లాలోని హిమాచల్‌ప్రదేశ్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియోగ్రఫీ ప్రస్తుత చైర్మన్, మండి సర్దార్ పటేల్ యూనివర్శిటీ మాజీ వీసీ దేవ్‌దత్ శర్మలను సభ్యులుగా నియమించారు. ప్రభుత్వ నామినీగా నియమితుడైన సభ్యుడు కమిటీ చైర్మన్‌గా వ్యవరిస్తారని, వీలైనంత తొందరగా వీసీ నియామకం కోసం అవసరమైన సమావేశాలను నిర్వహించాలని పేర్కొంటూ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి పెట్టాలి

తంబళ్లపల్లె, జూలై 30(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి పెట్టాలని డీపీవో రాధమ్మ సూచించారు. బుధవారం డీఎల్‌పీవో నాగరాజుతో కలిసి రేణుమాకులపల్లెలో ఆమె పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య పనులు, చెత్త సంపద కేంద్రం, మురుగు కాలువలు, తాగు నీరు, వీధి దీపాలను పరిశీలించారు చెత్తను వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని స్థానికులకు సూచించారు. అడపాదడపా వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఈశ్వర్‌రెడ్డి, కార్యదర్శి జితేంద్రనాయక్ పాల్గొన్నారు.

APK... క్లిక్ చేస్తే

ఏపీకే అనేది ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఉపయోగించే యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడానికి ఉపయోగించే ఫైల్ ఫార్మాట్. సైబర్ నేరస్థులు హానికరమైన ఏపీకే ఫైల్‌లను సృష్టించి వాటిని సోషల్‌మీడియా, మెసేజింగ్ యాప్‌ల ద్వారా పంపుతారు. ఈఫైల్‌లు నమ్మదగిన యాప్‌ల మాదిరిగానే కనిపిస్తాయి. కానీ అవి మాల్వేర్‌ను కలిగి.. వినియోగదారుల ఫోన్‌లను హ్యాక్ చేయడానికి ఉపయోగిస్తారు.

- లింక్ టచ్ చేస్తే.. డేటా సైబర్ నేరగాళ్ల చేతిలోకే
- అప్రమత్తంగా లేకపోతే క్షణాల్లో ఖాతా ఖాళీ



కడప క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నేటి డిజిటల్ ప్రపంచంలో మొబైల్ యాప్‌లు మన దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారాయి. అయితే, గూగుల్, ప్లేస్టోర్ వెలుపుల యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు మీకు తరచుగా ఏపీకే అనే ఫైల్ ఫార్మాట్ తారసపడవచ్చు. చాలా మంది యూజర్లు ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేయడానికి సంకోచిస్తుంటారు. ఇది హ్యాకింగ్‌కు లేదా బ్యాంక్ ఖాతా మోసాలకు దారితీయవచ్చని భయపడుతుంటారు. ఏపీకే ఫైల్ అంటే ఏమిటి... దాని ప్రాముఖ్యత ఏంటి, దాంతో వ్యవహరించేటప్పుడు ఎందుకు జాగ్రత్త అవసరమో సైబర్ క్రైం పోలీసులు చెబుతున్న వివరాలు తెలుసుకుందాం.



సైబర్ నేరగాళ్లు వాట్సప్ గ్రూపుల్లో పంపిన లింకులు

ఏపీకే మోసాలు ఇలా..

ఏపీకే అంటే ఆన్‌లైన్ ప్యాకేజీ కిట్ అని అర్థం. హ్యాకింగ్ చేసేందుకు ఉపయోగించే ఒక అప్లికేషన్ ఇది. ఎక్కువగా బ్యాంక్ పేర్లపై ప్రభుత్వానికి చెంది న స్కీముల పేరుతో పంపిస్తారు. వాట్సప్ ద్వారా పంపించారంటే పొరపాటున అది క్లిక్ చేస్తే మీ డేటా మొత్తం సైబర్ నేరగాళ్లు లాగేసుకుంటారు. తరువాత మన గ్రూపులో ఉన్న వాట్సప్ నంబర్‌లకు పంపిస్తారు. వారు ఎవరైనా క్లిక్ చేస్తే ఖాతా లో డబ్బు కాజేస్తారు.

ప్రస్తుతం ఏపీకే అప్లికేషన్ మోసాలు ఎక్కువయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడు నెలల్లో 94 ఫిర్యాదులు రాగా 96 లక్షలు డబ్బులను సైబర్ నేరగాళ్లు స్వాహా చేశారు. దీన్ని బట్టి మోసపోయే వారు ఎలా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఇలాంటి మోసాలకు పాల్పడే అవ కాశం ఉండదు.

జిల్లాలో ఇటీవల జరిగిన ఘటనలు..

- ఇటీవల జిల్లాలో ఏపీకే మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన ఓ ఉద్యోగికి పీఎం కిసాన్ పేరుతో లింకులు పంపించారు. దీంతో ఆయన ఆ లింక్ క్లిక్ చేయడంతో రూ.81 వేలు పోగొట్టుకున్నారు.
- సీకేదిన్నె మండలానికి చెందిన ఓ విద్యార్థి ఏపీకే లింక్ పంపి రూ.8వేలు కాజేశారు.
- కడప చెందిన ఓ మహిళకు ఎస్‌బీఐ యూనో లింక్ పంపించారు. ఆమె ఆ లింకును క్లిక్ చేయడంతో రూ.30 వేలు పోగొట్టుకున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటే సొమ్ము సేఫ్‌గా ఉంటుందని సైబర్ క్రైం పోలీసు అధికారులు చెబుతున్నారు.

పరివర్తన రావడానికి చర్యలు : డీఈవో



ఉపాధ్యాయులను విచారిస్తున్న డీఈవో షంషుద్దీన్

కమలాపురం రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన వారిలో పరివర్తన రావడానికి చర్యలు తప్పవని డీఈవో షంషుద్దీన్ అన్నారు. మండల పరిధిలోని పెద్దచెప్పలి హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి మంగళవారం మద్యం తాగి స్కూలుకు రావడంతో జిల్లా కలెక్టరు శ్రీధర్ చెరుకూరి వెంటనే సస్పెండ్ చేశారు. దీనిపై విచారణ అధికారి డీఈవో షంషుద్దీన్ బుధవారం హైస్కూలుకు చేరుకుని ఉపాధ్యాయులను విచారించారు. ఇలాంటి తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు.

వైవీయూ అధ్యాపక సంఘ నూతన కార్యవర్గం



అధ్యాపక సంఘం నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం అధ్యాపక సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహణ అధికారి ప్రొఫెసర్ ఎస్.ఈశ్వరరెడ్డి ప్రకటించారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యుల అంగీకారం మేరకు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా వృక్షశాఖ ప్రొఫెసర్ ఎ.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తెలుగుశాఖ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎం వినోదిని, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ ఎల్.మాధవి, డాక్టర్ వి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కె.మృత్యుంజయరావు, కోశాధికారిగా డాక్టర్ జయంతి కశ్యప్‌లను ఎన్నుకున్నారు. పాలకమండలి సభ్యులుగా డాక్టర్ ఎ.శ్రీధర్‌బాబు, ఆచార్య మెర్సీ విజేత, డాక్టర్ వీవీ వెంకటరాము, డాక్టర్ వరప్రభాకర్, డాక్టర్ అను ప్రసన్న, డాక్టర్ గణేష్‌నాయక్, డాక్టర్ వి.లాజర్, డాక్టర్ గంజి పార్వతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రొద్దుటూరులోని వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుల నుంచి ఒక సంయుక్త కార్యదర్శి, ఒక పాలకమండలి సభ్యుడు ఉంటారని తెలిపారు. ఈ కార్యవర్గం రెండేళ్ల కాలపరిమితితో పనిచేస్తాయన్నారు.

పోలీసుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం

- ఆరోపించిన బాధితులు

కడప క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పోలీసుల వేధింపులతో తమ సోదరుడు ఆర్.చిన్న బాలయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అతడి సోదరులు ఏసన్న, బాలయ్య తెలిపారు. బుధవారం వీరు మీడియాతో మాట్లాడుతూ.. కొండాపురం మండలం సుగుమంచిపల్లె గ్రామానికి చెందిన ఆర్.చిన్నబాలయ్య (45)ను పోలీసులు వేధిస్తున్నారని అన్నారు. తమకు చాలా కాలం క్రితం ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చిందని అయితే ఆ స్థలాన్ని ఓ హోంగార్డు, కానిస్టేబుల్ ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దీనిని అడ్డుకున్నందుకు తమ సోదరుడిపై తప్పుడు కేసులు పెడుతున్నారని వాపోయారు. దీంతో మనస్థాపం చెంది చిన్నబాలయ్య మంగళవారం పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వెంటనే కడప రిమ్స్‌కు తీసుకొచ్చామన్నారు. మెరుగైన చికిత్సకోసం కర్నూలుకు తీసుకుపోతు న్నామని, తమకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు. దీనిపై తాళ్లప్రొద్దుటూరు పోలీసులను వివరణ కోరగా చిన్నబాలయ్యపై తాళ్లప్రొద్దుటూరులోనే ఐదు కేసులు నమోదయ్యాయని సీకేదిన్నె, తలమంచిపట్నం పోలీస్ స్టేషన్లలో కూడా కేసులున్నాయని అన్నారు. అతడు నేరాలకు పాల్పడ్డంతోనే కేసులు నమోదు చేశామని తెలిపారు.

గ్రామ సుపరిపాలనలో జడ్పీటీసీల పాత్ర కీలకం

- జడ్పీ సీఈవో ఓబులమ్మ



మహిళా జడ్పీటీసీలకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్

కడప రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ సుపరిపాలనలో జడ్పీటీసీలు కీలక పాత్ర వహించాలని జడ్పీ సీఈవో, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ సి.ఓబులమ్మ పేర్కొన్నారు. బుధవారం జడ్పీ కార్యాలయ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం (డీపీఆర్‌సీ)లో మహిళా జడ్పీటీసీలకు రెండో రోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు ఈ శిక్షణకు 25 మంది మహిళా జడ్పీటీసీలకు ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. రెండోరో జు బుధవారం మాత్రం 14 మంది హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి సీఈవో ఓబులమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామస్థాయిలో మహిళల భాగస్వామ్యం, న్యాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణను కల్పిస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో మహిళల స్వశక్తీకరణ మరింతగా పెరగాలన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి బలమైన ఆధారంగా నిలుస్తోందన్నారు. ప్రజలే నిర్ణయాలలో భాగస్వాములు కావడానికి అవకాశం కల్పిస్తుందన్నారు. గ్రామీణ భవిష్యత్ నిర్మాణంలో మహిళా జడ్పీటీసీల పాత్ర మరింత కీలకంగా మారిందన్నారు. తమరోజువారి పనుల్లో ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలకు పరిష్కార మార్గం చూప డానికి ఈ శిక్షణా మాడ్యూల్‌ను రూపొందించడం జరిగిందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాల ద్వారా మహిళా జడ్పీటీసీలకు సుస్థిరమైన సాధికారత కలుగుతుందన్నారు. మరిం త ధైర్యంగా, నమ్మకంగా నాయకత్వ బాధ్యతలు తీసుకునే స్థితిలోకి వస్తారన్నారు. తమ నైపుణ్యాలపై అవగాహనను పెంచుకుంటూ గ్రామ అభివృద్ధిని ముందుండి నడిపించేందుకు పూర్తిగా సిద్ధంగా ఉంటారన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు దోహదపడుతుందన్నారు.

కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, ఏవో బండపల్లి నాగభూషణం, మాస్టర్ ట్రైనర్స్, మహిళా జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ గుడికి రూ.8.94 లక్షల ఆదాయం

సీకేదిన్నె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గంగమ్మ గుడికి రూ.8,94,500 వేలం ద్వారా ఆదాయం వచ్చినట్లు ఈవో కృష్ణానాయక్ తెలిపారు. బుధవారం నిర్వహించిన వేలంలో షామియానా, కుర్చీలు, టేబుళ్లకు ఆజాద్‌నగర్‌కు చెందిన ఎ.వెంకటసుబ్బయ్య రూ.5.80లక్షలకు దక్కించుకున్నారన్నారు. కూల్‌డ్రింక్ షాపునకు ప్రొద్దుటూరుకు చెందిన ఎం.వెంకటరమణ రూ.1.86 లక్షలకు, పూలు, పూజా సామాగ్రి కడప అక్కాయపల్లెకు చెందిన ఎం.పవన్‌కల్యాణ్ రూ.1.22 లక్షలకు, చెప్పులస్టాండు కె.పెద్దఓబులేసు రూ.6,500లకు దక్కించుకున్నారన్నారు. వీరికి ఆగస్టు 1 నుంచి వచ్చే సంవత్సరం జూలై 31 వరకు హక్కులు కల్పించామని ఈవో తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇనుపగేటు మీదపడి చిన్నారి మృతి



అనుశ్రీ (ఫైల్ ఫొటో)

ముద్దనూరు జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి నల్లబల్లె గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు ఇంటి ముందున్న ఇనుపగేటు మీదపడటంతో చిన్నారి అనుశ్రీ(7)మృతి చెందింది.స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా.. తొండూరు మండలం ఊడవగాండ్ల గ్రామానికి చెందిన గాయత్రీ ప్రసవానికి తల్లిగారింటికి నల్లబల్లెకు ఒక్కగానొక కూతురు అనుశ్రీతో వచ్చింది. సాయంత్రం ఆడుకుంటుండగా ఇంటిముందున్న ఇనుప గేటు ఊడి చిన్నారిపై పడింది. తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్లు తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న చిన్నారి మరణంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

యువకుడు ఆత్మహత్య



లింగాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామంలో బుధవారం ఎర్రమేకల భరత్‌కుమార్ (23) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... భరత్‌కుమార్ కొన్ని సంవత్సరాల నుంచి కంటి సమస్య, మైగ్రేన్ తలనొప్పి తదితర సమస్యలతో బాధపడుతుండేవాడు. ఆరోగ్య సమస్యలను భరించలేక, ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూసైడ్ నోట్ రాసి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

చాపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఖాజీపేటకు చెందిన సుంకు వెంకట మీనాక్షి అనే విద్యార్థిని ఈ నెల 29న మంగళవారం అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఓ ప్రైవేటు కాలేజీలో మీనాక్షి బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. మంగళవారం కళాశాలకు వెళుతున్నానని చెప్పి ఇంటి వద్ద నుంచి వెళ్లిపోయి తిరిగి ఇంటికిరాలేదు. ఈ మేర కు విద్యార్థిని తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆకుల వీధిలో చోరీ

కడపక్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆకుల వీధిలో ఈనెల 29న గుర్తు తెలియని దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి 7 తులాల బంగారు అపహరించినట్లు టూటౌన్ ఎస్‌ఐ హుసేన్ తెలిపారు. ఆకుల వీధిలో నివాసం ఉంటున్న షేక్ తస్లీమ్ అనే మహిళ మంగళవారం పుట్టింటికి వెళ్లిందని, తిరిగి బుధవారం వచ్చే లోపు ఇంటి తాళాలు తెరచి ఉండడంతో ఇంట్లో బీరువాను పరిశీలించగా అందులో ఉన్న 7 తులాల బంగారు నగలను చోరీ చేసినట్లు గుర్తించిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను వెంటనే చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కడప జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ ఇలియాస్ బాష, రాళ్లపల్లె అబ్దుల్లాలు డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు విద్యారంగ ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఆగస్టు 2వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా విజయవంతం చేయ డానికి ముందస్తు సమావేశం నిర్వహించారు.

మృతుని కుటుంబానికి ఎన్ఆర్ఐ చేయూత

- ప్రవాస భారతీయుడు రూ.లక్ష విరాళం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


అప్పుల బాధ తాళలేక అన్నదాత ఆత్మహత్య

'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం



నగదును అందజేస్తున్న ఎంపీడీవో రామచంద్రయ్య, సర్పంచ్ బీబీ

దువ్వూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక అన్నదాత ఆత్మహత్య అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో గత ఏడాది డిసెంబరు 20వ తేదీన ప్రచురితమైంది. అప్పట్లోనే అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐ ఈ విషయమై వాకబు చేశారు. మృతుని కుటుంబ పరిస్థితి తెలుసుకుని ఇండియాకు వచ్చినప్పుడు ఏదో ఒకరూపంలో సాయం చేస్తానని అప్పట్లో ఎన్ఆర్ఐ మాట ఇచ్చారు. ఈ ప్రకారం రూ.లక్ష నగదు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చి సదరు కుటుంబానికి అందజేయమన్నారు. ఈ మేరకు దువ్వూరు మండలం కానగూడూరు గ్రామానికి చెందిన మల్లేష్ భార్య సుమలత వారి పిల్లలను పిలిపించి స్థానిక గ్రామ సచివాలయంలో ఎంపీడీవో రామకృష్ణయ్య, అక్కడి సర్పంచ్ బీబీ చేతుల మీదుగా నగదును బుధవారం అందజేశారు. పోస్టాఫీస్ బీపీఎం ప్రసాద్‌ను పిలిపించి మృతుని నలుగురు కూతుర్ల పేరుమీద నగదును డిపాజిట్ చేయమని ఎంపీడీవో ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పీ4 సర్వే ఉద్దేశ్యం ఇదేనని, పేదరికం పారదోలేందుకు గ్రామాలను దత్తత తీసుకుని ఆర్థిక, మాటసాయం, వస్తు రూపేణా తోడ్పడటం పీ4 లక్ష్యమన్నారు. ఈ సాయం పి4 సర్వేకు దగ్గరగా ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం, గ్రామ వీఆర్వో, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

3న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఆగస్టు 3వ తేదీ ఆదివారం ఉదయం జిల్లాస్థాయి అండర్-14, 16 అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమద్ బాష తెలిపారు. అండర్-14 విభాగంలో బాలబాలికలకు 60 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలు ఉంటాయన్నారు. అండర్-16 విభాగంలో బాలబాలికలకు 60, 600 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచినవారు ఆగస్టు 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు ఆధార్, బర్త్‌సర్టిఫికెట్‌ను తీసుకురావాలని కోరారు

ప్రాచీన కళలను కాపాడుకునేందుకు చొరవ చూపాలి : ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీకి తోలుబొమ్మను బహూకరిస్తున్న కుళాయప్ప

పులివెందుల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రాచీనకళలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు చొరవ చూపాలని ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పులివెందులలోని ఆయన స్వగృహంలో హస్తకళల విభాగంలో జాతీయ అవార్డులను పొందిన దలవాయి కులాయప్ప ఎమ్మెల్సీని కలిశారు. తోలు బొమ్మను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామంలో తోలుబొమ్మ కళాకారులైన తల్లీకొడుకులైన దలవాయి శివమ్మ, దలవాయి కులాయప్పలు హస్తకళల విభాగంలో ఇటీవల జాతీయ అవార్డులను పొందారన్నారు. ప్రాచీక కళలలు అంతరించిపోకుండా శ్రీకృష్ణ చరిత విశ్వరూపహనుమాన్ వంటి కళాఖండాలను రూపొందించి ఆదర్శంగా నిలిచారన్నారు. తల్లీకొడుకులకు జాతీయ అవార్డు రావడంతో ఎమ్మెల్సీ వారిని అభినం దించారు. దేశస్థాయిలో ఆంధ్ర రాష్ట్రానికి ఖ్యాతితెచ్చినందుకు వారిని ప్రశంసించారు.

హోరాహోరీగా సాగుతున్న మల్టీడే క్రికెట్ పోటీలు



ఆదినారాయణ (అనంతపురం), రుత్వీక్‌కళ్యాణ్ (చిత్తూరు)

కడప స్పోర్ట్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే (మూడురోజులు) క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా రెండో రోజైన బుధవారం పోటీలు సాగాయి. అనంతపురం జట్టు కడప జట్టుపై 270 పరుగులు ఆధిక్యత సాధించగా.. మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు చిత్తూరు జట్టుపై 25 పరుగుల స్వల్ప వెనుకంజలో నిలిచింది. వివరాలిలా... కడప రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-అనంతపురం జట్లు మధ్య మ్యాచ్ సాగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో అనంతపురం జట్టు 53.1 ఓవర్లలో 186 పరుగులకు మొదటి ఇన్నింగ్స్‌లో ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరుతో రెండోరోజైన బుధవారం తిరిగి బ్యాటింగ్ ప్రారంభించి 53.3 ఓవర్లలో 158 పరుగులకు కుప్పకూలింది. దీంతో అనంతపురం జట్టుకు 28 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 70 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 242 పరుగులు సాధించింది. ఇందులో ఆదినారాయణ 118 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో ఇప్పటి వరకు 270 పరుగుల ఆధిక్యత సాధించి పటిష్ఠ స్థితికి చేరుకుంది.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో మొదటిరోజు తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 92.1 ఓవర్లలో 325 పరుగులు భారీ స్కోరుకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 44 పరుగులు చేసింది. రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 44 పరుగులతో తిరిగి బ్యాటింగ్ చేపట్టిన కర్నూలు జట్టు 100 ఓవర్ల పాటు ఆడి 8 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది. ఇందులో రుత్విక్ కళ్యాణ్ 90 పరుగులు చేశాడు. దీంతో కర్నూలు జట్టు మరో 25 పరుగుల స్వల్ప వెనుకంజలో ఉంది.

ఎన్‌ఎల్‌ఎస్‌ఏ లక్ష్యాలను సాధించాలి

కడప రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలు నిర్వహించే కార్యక్రమాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి వాటి ప్రయోజనాలను అందేలా చూడాలని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

వేంపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక ప్రాంతీయ అధికారి భూపాల్‌రెడ్డి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎలాంటిచర్యలు తీసుకోవాలన్న విషయంపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని సూచించారు. వేంపల్లె నారాయణ హైస్కూల్లో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఆయనను కరస్పాండెంట్ నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది అగ్నిమాపక ప్రాంతీయ అధికారి భూపాల్‌రెడ్డిని సత్కరించారు.

ఆశా మహాసభలను జయప్రదం చేయండి

కడప మారుతీనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడపలో వచ్చే ఆగస్టు 30, 31 తేదీల్లో తలపెట్టిన ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసేందుకు పెద్దఎత్తున ఆశా కార్యకర్తలు తరలి రావాలని ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఏఐటీయుసి కార్యాలయంలో ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.అనసూయ, కోశాధికారి సి.అమ్ములు, నగర అధ్యక్ష,కార్యదర్శులు లక్ష్మీనరసమ్మ, శాంతమ్మలతో కలిసి మహాసభలకు చెందిన గోడపత్రాలు ఆవిష్కరించి ఆయన మాట్లాడారు.

'ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం'

కడప ఎర్రముక్కపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దుష్ట సాంప్రదాయాలకు ప్రభుత్వం తెరలేపిందని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బుధవారం కడపలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్పొరేటర్ మహమ్మద్ షఫి, అలీ అక్బర్, బసవరాజు, బంగారునాగయ్యయాదవ్ పాల్గొన్నారు.

ప్రతి పనిలో పారదర్శకత ఉండాలి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ సిబ్బంది సచివాలయ సిబ్బంది వారి విధి నిర్వ హణలో పారదర్శకత ఉండాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలో సచివాలయ సెక్షన్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది రోజువారి అటెండెన్స్, లీవ్స్, సంబంధించిన సర్వీస్ మ్యాటర్స్, అక్క డ సిస్టమ్స్‌ను, ప్రింటర్స్‌ను పరిశీలించారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణలపై హెచ్చరికలు..!

- తొలగించాలంటున్న రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పోలీసులు
- తొలగించే ప్రసక్తే లేదంటున్న దుకాణదారులు

చెన్నూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాకపోకలకు, రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెడల్పు అయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు కొంతకాలంగా పలువురు దుకాణదారులు రోడ్డు ఆక్రమించుకుని వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో రోడ్డు వెడల్పు తగ్గింది. పలువురు వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడంతో ఆ అంగడి వద్దకు ఏదైనా అవసరం నిమిత్తం వచ్చినవారు రోడ్డు అంచు వరకు వారి దుకాణాలు ఉండడంతో తమ వాహనాలను రోడ్డుపైనే నిలిచి ఆ దుకాణంలోకి వెళ్లివస్తుంటారు. దీంతో అదే దారిన రాకపోకలు సాగించేవారు ఈ రోడ్డు పైనే వాహనాలు నిలిపి ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొంత కాలంగా ఈ ఇబ్బందులు జరుగుతుండడంతో పలువురు స్థానికులు ఈ విషయాన్ని ఉన్నతాధికారలు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతోఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చెన్నూరు రెవెన్యూ, గ్రామ పంచాయతీ,



ఇరుకుగా ఉన్న చెన్నూరులోని ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఆర్‌అండ్‌బీ , పోలీసులు రోడ్డును సర్వే చేసి మార్కింగ్ కూడా ఇచ్చారు. అలాగే మార్కింగ్ వరకు ఉన్న ఆక్రమణలు తొలగిస్తేనే రోడ్డు విశాలంగా ఉంటుందని, రాకపోకల ఇబ్బంది ఉండదని తెలిపారు. దీంతోఆక్రమణలు తొలగించుకోవాలని లేదంటే మేమే తొగటిస్తామని అధికారులు మొదటి దఫా కొద్దినెలల క్రితం హెచ్చరించారు. మరలా బుధవారం సర్వేయరు ఖాజాహుసేన్, ఆర్‌ఐ నాగసుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఆర్‌అండ్‌బీ సిబ్బంది, పోలీసుసిబ్బంది స్థానిక రెవెన్యూ కార్యాలయ పోలీసు స్టేషన్ నుంచి కొండపేట రోడ్డు వరకు ఇరువైపులా ఉన్న దుకాణదారులను హెచ్చరించారు. మీకు వారం రోజుల గడువు ఇస్తాం, కచ్చితంగా రోడ్డు వైపు ఏర్పాటుచేసుకున్న ఆక్రమణలన్నీ తీసివేసుకోండంటూ పదే పదే చెప్పడం జరిగింది. అంతేకాక తీసుకోకపోతే తరువాత మేమే తొలగిస్తాం అంటూ చెప్పడం జరిగింది. పైగా ఆక్రమించుకన్న స్థలం మీది కాదు, ఇది ప్రభుత్వ స్థలం, మార్కింగ్ ఇచ్చినంత వరకు ఎవరైనా ఆక్రమణలు తీసివేయాల్సిందేనని పదే పదే చెప్పడం జరిగింది. అయితే రెవెన్యూ, పంచాయతీ ఆర్‌అండ్‌బీ సిబ్బంది చెప్పిన మాటలు దుకాణదారులు లెక్క చేయలేదు.

తొలగించే ప్రసక్తే లేదంటున్న దుకాణదారులు



దుకాణదారులతో మాట్లాడుతున్న అధికారులు

ఆర్‌అండ్‌బీ రోడ్డుకిరువైపులా ముందుకు వచ్చిన చొచ్చుకొని వచ్చిన దుకాణ దారులు తాము తమ దుకాణాలను తొలగించే ప్రసక్తిలేదని రెవెన్యూ, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ సిబ్బందికి తేల్చి చెప్పారు. మూడునెలలకు ఒకమారు వస్తారు, వచ్చి చెప్పిపోతారు. ఇదేం బాగా లేదు, మేం తొలగించం, బస్సులు తిరగడంలేదు. బస్సులు తిరిగితే ఇబ్బంది లేకుండా తొలగిస్తామంటున్నారు. పైగా క్రాసింగ్ వద్ద చెన్నూరు క్రమంలోకి వస్తే ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఇబ్బందులు పడ్డాం, అవన్నీ ఆర్‌అండ్‌బీ పట్టించుకోలేదన్నారు. అధికారులు మాత్రం వారంరోజులు గడువు ఇస్తున్నాం. ఈ లోగా మీరు స్వచ్ఛందంగా తొలగిస్తే సరిపోతుంది లేదా చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. కాసేపు దుకాణదారుల మధ్య మాటలు పెరిగి కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం కనిపించింది.

3న సహాయ పరికరాల గుర్తింపు శిబిరం

పెండ్లిమర్రి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు,వయోవృద్ధులకు ఆగస్టు 3వ తేదీ ఆదివారం రెండు గంటల నుంచి సామాజిక,సాధికారికత మంత్రిత్వ శాఖ సౌజన్యంతో కృత్రిమ అవయవాల సంస్థ కాన్పూర్ వారు సహాయ పరికరాల గుర్తింపు శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సురేంద్రనాథ్ తెలిపారు. వయోవృద్ధులు శిబిరానికి వచ్చేటపుడు రేషన్,ఆధార్‌కార్డులు,ఆదాయ ధృవీకరణ పత్రం, నాలుగు ఫొటోలు, దివ్యాంగులు ఆధార్‌కార్డు,సదరం సర్టిఫికెట్, ఆదాయ ధృవీకరణ పత్రం,రేషన్‌కార్డు,రెండుఫొటోలు తీసుకొని రావాలన్నారు.

మెమో 57 అమలు కావాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మెమో 57 అమలు చేయాలని 2003 డీఎస్సీ టీచర్స్ ఫోరం కన్వీనర్ గుజ్జల తిరుపాల్ విన్నవించారు. బుధవారం పులివెందులలోని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటశివారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

కడప ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు నాగమణి పేర్కొన్నారు. బుధవారం కడప నగరం గాంధీనగర్ స్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని మె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు కోడిగుడ్డు, చిక్కీలు అందిస్తున్నామన్నారు. అలాగే వెజిటబుల్ కూరలతో కోడిగుడ్డు,చిక్కీలు మంచి భోజనం అందిస్తున్నామన్నారు.

పచ్చిరొట్ట ఎరువు ఎంతో మేలు

కమలాపురం రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరుగుతుందని ఏవో సరస్వతి అన్నారు. బుధవారం గంగవరం,విభరాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో మినుము,వరి పంటలను వ్యవసాయ సిబ్బంది పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ సిబ్బంది స్వరూప, ఇందిర, గ్రామ వ్యవసాయ సహాయకుడు సందీప్, రైతులు పాల్గొన్నారు.





అధికారుల అండదండలతోనే భూకబ్జాలు

కడప సెవెన్ రోడ్స్ జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో కబ్జాదారులచేతుల్లో ఉన్న ప్రభుత్వభూమిని తిరిగి స్వాధీనం చేసుకొని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ నగరకార్యదర్శి రామమోహన్ అన్నారు. అలాగే అఖిలపక్ష పార్టీల ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు,స్థలాలను ప్రైవేటు వ్యక్తుల కబ్జాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో రెవెన్యూ కార్పొరేషన్ యంత్రాంగం ఘోరంగా విఫలమైందని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ సర్కిల్లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ నగరంలో ఉన్న ప్రభుత్వ భూములు అన్నీప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అధికార యంత్రాంగం సహకరిస్తుస్తోం దన్నారు. తక్షణం ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకొని భూకబ్జాదారులపై కేసులునమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కడప నగరంలో దాదాపు 700ఎకరాలు ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో బదలాయింపు జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శ్మశానాలు,కాల్వలు, వంకలు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం వల్ల భవిష్యత్తులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. భూకబ్జాదారులకు రెవెన్యూ, కార్పొరే షన్ అధికారులు పెద్దఎత్తున సహకారం అందించడం వల్లనే ప్రభుత్వ



అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్షం

భూములు అన్యాక్రాంతమవుతున్నాయని అన్నారు. కడపనగరాన్ని భూకబ్జాదారుల కబంధ హస్తాల నుంచి కాపాడాలని లేనిపక్షంలో దశలవారి ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామమోహన్, సత్తార్, ఓబయ్యమక్బుల్ బాషరాము, సుబ్బరాయుడు, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆర్తీ హోంకు పురస్కారం

కడప(వినాయకనగర్), జూలై30(ఆంధ్రజ్యోతి): మీడియా ఛానెల్, బ్యాంకు వారి సంయుక్త ఆధ్వర్యంలో బెంగళూరులో జరిగిన ఫిమేల్ ఫార్వర్డ్ కార్యక్రమంలో మహిళా అభ్యున్నతికి గణనీయమైన సేవ చేస్తున్న ఆర్తీ హోంకు అత్యుత్తమ పురస్కారం లభించిందని వ్యవస్థాపక అధ్యక్షురాలు పుచ్చలపల్లి సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అనుకుంటే ఏమైనా సాధించగలరన్నారు. ఆడపిల్లలు విద్య, ప్రేమ, సామాజిక గౌరవం, నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్ష మేరా బిడ్డల భవిష్యత్‌ను కాపాడుకోవాలన్నారు.

ఎంఈఓ-1,ఎంఈఓ-2కు సన్మానం

కడప ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడప మండలం నూతన ఎంఈఓ-1గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రఫీక్ అహ్మద్,ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్‌కు బుధవారం కడప ఎమ్మార్సీలో రూట ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రూట జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాలైన బీడీ కాలనీ, భగత్‌సింగ్‌నగర్, సాగర్ కాలనీలో నూతన ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సత్తార్ ఫైజి, హాజీ అబ్దుల్ హకీమ్, అఫ్జల్ బాష, మస్తాన్‌వలి, ఖదీర్ పర్వేజ్, ముహమ్మద్ అయుబ్, ముహమ్మద్ ఇర్షాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జుబేర్ అహ్మద్, జిల్లా ఆర్థిక కార్యదర్శి కరామతుల్లా, నూరుల్లా తదతరులుపాల్గొన్నారు.

చదువుతోనే అన్నీ సాధ్యం

వల్లూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చదువుతూనే బాలికలకు అన్ని సాధ్యమవుతాయని జీసీడీవో రూతు ఆరోగ్యమేరీ అన్నారు. బుధవారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికలతో మాట్లాడారు. ముఖ్యంగా ప్రతి ఇంటిలో బాలికల చదువుకుంటే ఆ బాలికతో పాటు ఆ కుటుంబం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో నిజామున్నీసా, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొడతాం'

సింహాద్రిపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు పెంచినా, స్మార్ట్ మీటర్లు బిగించినా ప్రజా ఉద్యమం తప్పదని స్మార్ట్ మీటర్లు ఎక్కడికక్కడ పగులగొడతామని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ)జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలంలోని అంకాళమ్మ గూడూరులో స్థానిక కల్యాణ మండపంలో సీపీఐ మండల సమితి సమావేశం జరిగింది.ఈ సమస్యపై ఆగస్టు 5న జిల్లా వ్యాప్తంగా సీపీఐ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు, సహాయ కార్యదర్శి కొత్త కాల్వ బ్రహ్మ, జిల్లా సమితి సభ్యుడు ఈశ్వరయ్య, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ



పులివెందుల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త షేక్ నాగిన్ బాష మరణించడంతో ఆయన కుటుంబాన్ని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అధైర్యపడవద్దని ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాగా షేక్ నాగిన్ బాష హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ షేక్ మహబూబ్ బాష తమ్ముడు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే పోరాటాలకు సిద్ధం : ఏఐటీయూసీ

కడప సెవెన్ రోడ్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వాలు ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, నేడు ఆ హామీ మరచిపోయి కార్మికులను అణగదొక్కే నిర్ణయాలు చేపడుతున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం స్థానిక హోచిమిన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఉపాధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, మంజుల, చాంద్‌బాష, సహాయ కార్యదర్శులు మద్దిలేటటి, లింగన్న, మస్తాన్ పాల్గొన్నారు.

సీమ మాండలికానికి జీవం పోసిన కథకుడు పులికంటి

కడప మారుతీనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ మాండలికాన్ని కథల్లో చొప్పించి ప్రాంతీయ భాషకు జీవం పోసిన కథకుడు పులికంటి క్రిష్ణారెడ్డి అని సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకుడు డాక్టర్ చింతకుంట శివారెడ్డి అన్నారు. పులికంటి క్రిష్ణారెడ్డి 95వ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక సీపీ బ్రౌన్ భాష పరిశోధన కేంద్రంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటనికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆ కేంద్రం ప్రతినిధులు వెంకటరమణ, పాఠకులు మోహన్‌రెడ్డి, నాగబాబు పాల్గొన్నారు.

పోలీసుల నుంచి బైకులు, సెల్‌ఫోన్‌లు ఇప్పించండి

పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవికి ముస్లిం మైనార్టీ నాయకుల విజ్ఞప్తి

వేంపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో స్థానిక వేంపల్లె, పక్కీరుపల్లెకు చెందిన పలువురి బైకులు, సెల్‌ఫోన్‌లు ఉన్నాయని, వాటిని ఇప్పించాలని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవికి ముస్లిం మైనార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. పులివెందులలో ఉన్న బీటెక్ రవిని టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, జిల్లా ఉపాధ్యక్షులు పూల బక్షు, యువనాయకులు యాసిన్, అబ్దుల్ రెహమాన్, లాడెన్, ఫయాజ్, గౌస్ తదితరులు బుధవారం కలిశారు. వేంపల్లెలో బాలిక అదృశ్యం ఘటనలో పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసిన వారిని తప్పకుండా శిక్షించాల్సిందేనని తెలిపారు. చాలా మంది పోలీస్‌స్టేషన్ వద్దకు ఏం జరుగుతోందో చూడ్డానికి వెళ్లిన వారు ఉన్నారని, బైకులు, సెల్‌ఫోన్‌లు తీసుకున్నారు.

శాంతియుతవాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు

పులివెందుల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోవు జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా శాంతియుత వాతావరణంలో నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఆర్.తుమ్మలపల్లె గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరూ గుంపులుగా ఉండకూడదని, సభలుసమావేశాలు జరపకూడదని తెలిపారు.





బ్రౌన్ గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులు పరిశీలన

కడప కల్చరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ అనుబంధ సంస్థ సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య అల్లంశ్రీనివాసరావు బుధ వారం పరిశీలించారు. ఎర్రముక్క పల్లెలో గల సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం వెనుకభాగంలో రూ.3.6 కోట్లతో పనులను సాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆ కేంద్రం సలహామండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్, సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి ఉన్నారు.

చింతకొమ్మదిన్నెను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం



తారురోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

సీకేదిన్నె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలాన్ని నియోజకవర్గంలోనే ఆదర్శంగా అభివృద్ధి చేస్తామని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం పాపాసాహెబ్‌పేట పంచాయతీ చెర్లోపల్లెలో బుధవారం రూ.45 లక్షలతో నిర్మించిన తారురోడ్డును ప్రారంభించారు. రూ.15 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మించడం జరిగిందని, మరో రూ.40 లక్షలతో రోడ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ మండల ఇన్‌చార్జి క్రిష్ణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ మోహన్ బాబు, విశ్వనాథరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, తహసీల్దారు నాగేశ్వరరావు, అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఎన్నికకు సహకరించండి : ఎంపీ

పులివెందుల రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా పులివెందుల జడ్పీటీసీ ఎన్నికకు సహకరించాలని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పులివెందుల ఆర్.తుమ్మలపల్లె గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి జడ్పీటీసీగా ఎన్నికైన రెండేళ్లకే ప్రమాదంలో మరణించారన్నారు. ఇక్కడ ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఏకాభిప్రాయంతో మహేశ్వర్‌రెడ్డి కుటుంబానికే టికెట్ ఇవ్వాలని నిర్ణయించారన్నారు. మానవీయకోణంతో పార్టీలకతీతంగా అందరు ఆ కుటుంబంవైపే నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించాలి

చక్రాయపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సర్వసభ్యసమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు మాధవి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కుళాయమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

మట్కా స్థావరంపై దాడి : ఒకరి అరెస్టు

బద్వేలుటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో మట్కా ఆడుతున్నట్లు సమాచారం రావడంతో విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో మట్కా ఆడుతున్న మహబూబ్‌పాషాను అదుపులోకి తీసుకుని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

బ్రహ్మంగారిమఠం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంగిరెడ్డిపల్లె గ్రామం మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల మేరకు.. బ్రహ్మంగారిమఠం భగత్‌సింగ్ కాలనీకి చెందిన సుబ్బయ్య కుమారుడు సూరి, అదే గ్రామానికి చెందిన ప్రసాద్ కుమారుడు సన్నీ తీవ్రంగా గాయాలపాలయ్యారు. మెరుగైన వైద్యచికిత్స కోసం 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టైర్ల వ్యాను బోల్తా : తప్పిన ప్రమాదం

కొండాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొగాపురం ఫ్లైఓవర్ దగ్గర బుధవారం టైర్ల లోడుతో వెళుతున్న బొలెరో క్యాంపర్ వ్యాను బోల్తా పడింది. కడప నుంచి తాడిపత్రికి టైర్ల లోడుతో వెళుతుండగా అక్కడికి రాగానే క్యాంపర్ అదుపుతప్పి బోల్తాపడింది. కాగా ఈ సంఘటనలో క్యాంపర్ డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న ఆర్టీసీ బస్టాండ్

ప్రొద్దుటూరు అర్బన్ జూలై 30(ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ బస్టాండ్ పనులు పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ప్రయాణికుల సౌకర్యం మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఫర్నిచర్ రావడం జరిగిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. త్వరలో అన్ని సౌకర్యాలతో నూతన ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభమై ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని అన్నారు.

పశువుల దాణా పంపిణీ

బద్వేలుటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం చెన్నకేశంపల్లెలోని రైతులకు 50శాతం సబ్సిడీతో మంజూరైన పశువుల దాణాను బుధవారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కూటమి ప్రభుత్వంలో ఆనందంగా ఉన్నారన్నారు. వచ్చే నెల 2వ తేదీన అన్నదాత సుఖీభవ పథకం పేరుతో ప్రభుత్వం రైతుల ఖాతాలలో నగదును జమ చేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.







పేదలకు భవిష్యత్తు ఇవ్వాలన్నదే పీ-4 ఉద్దేశం

● ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం నెరవేర్చాలి : ఎమ్మెల్యే ఆది


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పేదలకు సాయం చేసి వారికి భవిష్యత్తు ఇవ్వాలన్నదే పీ-4 ఉద్దేశమని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న రిపబ్లిక్ క్లబ్ భవనంలో ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీన గూడెం చెరువుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాబోతున్నారన్నారు. ఆయన హెలిప్యాడ్ వద్ద నుంచి గూడెం చెరువుకు చేరుకుని పీ-4 సర్వేలో గుర్తించిన 162 బంగారు కుటుంబాలకు సంబంధించి పింఛన్ల పంపిణీ, అక్కడి నుంచి టిడ్కో గృహాల వద్ద సమావేశంలో పాల్గొంటారన్నారు. ప్రతి పేదవాడికి మాటసాయం లేదా ఆర్థికసాయం, చేనేత కుటుంబాలకు ముద్ర లోన్, ఇళ్ల నిర్మించుకునేవారికి హౌసింగ్‌లో సాయం చేయడం, చెట్లు నాటడం వంటివి పీ-4సర్వేలో భాగమేనన్నారు. అనంతరం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ పీ-4 సర్వే జమ్మలమడుగు నియోజకవర్గంలో 13 వేల మందిని గుర్తించడం జరిగిందన్నారు. ఆలంబిలాదరిని 3 నుంచి 4 సంవత్సరాల పాటు దత్తత తీసుకుని ప్రధానంగా వారి ఆశయం నెరవేర్చుటకు ఆర్థికంగా, జీవనోపాధి తోడ్పాటు తదితర వస్తు సహాయం చేసి సమాజంలో వారు వారి కాళ్లపై నిలబడే విధంగా చేయడమే పీ-4 ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సీనియర్ డాక్టర్ రామేశ్వరుడు, డాక్టర్ ఆగస్టీన్‌రాజు, భైరెడ్డి రఘునాథ్‌రెడ్డి, ఎస్సీ నాగేశ్వరరెడ్డి, మునిసుబ్బారెడ్డి, జగదీశ్‌రెడ్డి, కటిక మధుసూదన్‌రెడ్డి, కర్నాటి రామాంజనేయరెడ్డి, గంజికుంట తిరుమలదాసు, కల్లుట్ల మాబువలి, మూలింటి గురప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

ఎర్రగుంట్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిలమకూరు అంగన్వాడీ కేంద్రాలను ఎంపీడీవో వెంకటరమణ బుధవారం తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై అడిగి తెలుసుకున్నారు. అలాగే హాజరు, ఇతర సౌకర్యాలపై ఆయన పరిశీలించారు. చిన్నారులకు ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో కలియతిరిగి గ్రీన్ అంబాసిడర్లపై ఆరా తీశారు. పారిశుధ్యం గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలి

జమ్మలమడుగు, జూలై 30(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఏపీఎస్‌ఆర్‌టీసీ డిపోలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన డ్రైవర్లుగా పనిచేసేందుకు నిరుద్యోగ డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు అవుతున్న సందర్భంగా ఈ నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు హెవీ డ్రైవింగ్ లైసెన్సుతో పాటు 18 నెలల అనుభవం, ఆధార్‌కార్డు, ఆర్టీఏ క్లియరెన్స్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. దరఖాస్తులను డిపో మేనేజర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఈశ్వరీమాత ఆలయ పునర్నిర్మాణానికి రూ.51,111 విరాళం

బ్రహ్మంగారిమఠం, జూలై 30(ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాన కర్త, మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మనవరాలు, జగన్మాత ఈశ్వరీదేవి ఆలయ పునర్నిర్మాణానికి రూ.51,111 విరాళం అందించారు. బుధవారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు యూకత్‌పురా చార్మినార్ నివాసి కేసరి సింహాచలం, ధర్మపత్ని సంధ్యారాణి ఈ విరాళాన్ని మఠాధిపతి వీరశివకుమార స్వామికి అందించారు. ఈ సందర్భంగా మఠాధిపతి మాట్లాడుతూ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు విరాళాలు అందించి సహకరించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఖాజీపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 1200 ఓట్లు గల పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు ఏవీ రమణమ్మ పరిశీలించారు. బుధవారం ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు కూనవారిపల్లె, పత్తూరు, ఇంకా పలు పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. 1200 ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను రెండుగా ఏర్పాటు చేయాలని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పత్తూరులోని స్కూలును తనిఖీ చేసి పిల్లలతో ముచ్చటించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆచూకీ లభ్యం

కలసపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దంవారిపల్లె గ్రామానికి చెందిన సగిలి శశికళ అనే యువతి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ తిమోతి తెలిపారు. వివరాలిలా.. తన అమ్మమ్మకు ఆరోగ్యం బాగలేదని ముద్దంవారిపల్లెకు వచ్చిన శశికళ మూడురోజులపాటు ఇక్కడే ఉంది. ఆ తర్వాత తాను ఇంటికి వెళ్తానని చెప్పి రెడ్డిచర్లకు బయలుదేరింది. కానీ ఆమె రెడ్డిచర్లకు రాకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. దీంతో తమ కుమార్తె కనిపించడం లేదని ఈనెల 26న ఆమె తల్లిదండ్రులు సర్వేశ్వరరావు, వేలాంగిణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పేపర్లలో వచ్చిన ప్రకటన చూసిన ఆ యువతి కలసపాడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ప్రత్యక్షమైంది. తాను ఎక్కడికీ పోలేదని, బంధువుల, స్నేహితుల ఇళ్లలో ఉన్నానని తెలిపింది. దీంతో ఎస్‌ఐ తిమోతి యువతిని తల్లి వేలాంగిణికి అప్పగించారు.


తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

పెనికెలపాడు చెరువుకు నీరందించాలి

ముద్దనూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెనికెలపాడు చెరువుకు గాలేరు-నగరి కాల్వ నుంచి నీరందించాలని పెనికెలపాడు, రాజులగురువాయపల్లె, కొండ్రేపల్లె, నొస్సం వారిపల్లె గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. పెనికెలపాడు చెరువుకు అందుబాటులో గాలేరు-నగరి కాల్వ ఉందని, ఖర్చు తక్కువలో వంక ద్వారా చెరువుకు నీరు చేరుతుందన్నారు. దీంతో కరువు కాలంలో చెరువు ప్రాంతంలో నున్న ఏడు గ్రామాలకు సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి పర్యటన అనంతరం అధికారులు పరిశీలిస్తారని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌రెడ్డి, వరప్రసాద్ గౌడ్, పద్మనాభరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రామలక్ష్మిరెడ్డి, నారాయణరెడ్డి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయం


తెలుగుగంగ ఎస్‌ఆర్-1 నుండి దిగువకు నీరు వదులుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్

దువ్వూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె వద్దనున్న తెలుగుగంగ ఎస్‌ఆర్-1లో నీటిని దిగువనున్న చెన్నముక్కపల్లె కాలువకు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఆర్-1 ఆటు నుంచి ఎస్‌ఆర్-2 బ్రహ్మంసాగర్‌కు తెలుగుగంగ నీటితో నింపనున్నట్లు తెలిపారు. కుందూ ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేసేందుకు గతంలోనే రూ.563 కోట్లు కేటాయించినా గత వైసీపీ ప్రభుత్వం పనులు చేయలేకపోయిందన్నారు. ఆ పనులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుగంగ ఈఈ మల్లికార్జున, డీఈ గోవింద్, ఏఈలు, టీడీపీ నాయకులు రవీంద్ర, గురివిరెడ్డి, రమణారెడ్డి, రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసారాన్ని అనుసరించి ఎరువులను వాడాలి


మాట్లాడుతున్న ఏడీఏ అనిత

ప్రొద్దుటూరు రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగులో ఉన్న వరి పైరు వివిధ దశల్లో ఉన్నాయని, సాగులో భూసారాన్ని అనుసరించి ఎరువులను వాడాలని వ్యవసాయ శాఖ ప్రొద్దుటూరు డివిజన్ ఏడీఏ అనిత అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియాను పంట దశలో మూడు దఫాలుగా విభజించి వాడాలన్నారు. అధిక ఎరువులతో చీడపీడల ఉధృతి పెరుగుతుందన్నారు. వరి, మినుములో అధిక దిగుబడి వచ్చే రకాలు, సమగ్ర పోషణ, యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణపై శిక్షణ ఇచ్చారు. జమ్మలమడుగు వ్యవసాయశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి పంట నమోదు, పంట బీమా, భూసార యాజమాన్యం గురించి వివరించారు. ఆత్మా బీటీఎం చెన్నకేశవులు పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు, తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడికి మార్గదర్శకాలు సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు పవన్, పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

భవన కార్మిక సంక్షేమ బోర్డును ప్రారంభించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి పూసల యేసోబు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో భవన నిర్మాణ కార్మికులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు పోస్టుకార్డులు రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కార్మిక సంక్షేమ బోర్డును పునః ప్రారంభించి వారి సంక్షేమానికి కృషి చేస్తామని కూటమి ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లైంలను పరిష్కరించాలని, అలాగే 50 సంవత్సరాలు పూర్తయిన కార్మికులకు పింఛన్ పథకం వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు ప్రసాద్‌రావు, సాంబ, దాసు, మహబూబ్‌బాష, రవి, కుమార్, చిన్న, జాన్, తదితరులు పాల్గొన్నారు.

అందరూ మెచ్చేలా సుపరిపాలన : విజయమ్మ

బద్వేలుటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అందరూ మెచ్చేలా కూటమి ప్రభుత్వం సుపరిపాలనను అందిస్తుందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెన్నకేశంపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చెన్నకేశంపల్లెలోని వైసీపీకి చెందిన నాలి సుబ్బన్న, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు వారిని టీడీపీ పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈగ సుబ్బారెడ్డి, జీవి సుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సీఎం సుబ్బారెడ్డి, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పడకేసిన పారిశుధ్యం

● చెత్త సేకరణ లేక దిబ్బలా ఊరు ● సమావేశంలో ధ్వజమెత్తిన వైసీపీ కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో అభివృద్ధి పూర్తిగా పడకేసిందని వైసీపీ మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మునిరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్లు గతంలో చేసిన పనులకు రూ.20 కోట్ల మేర బిల్లులు రావాల్సిఉందని, టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఈ బిల్లులు అన్నీ నిలిపివేయించారన్నారు. రూ.3 కోట్లతో కొర్రపాడురోడ్డులోని మున్సిపల్ స్థలంలో నిర్మించిన కాంప్లెక్స్ లాంటివి కడితే మున్సిపాలిటీకి శాశ్వత ఆదాయం సమకూరుతుందన్నారు. కౌన్సిలర్లు రాచమల్లు రమాదేవి, మురిరెడ్డి సుబ్బారెడ్డి, ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చి చెత్త పన్నును రద్దు చేసి చెత్త వాహనాలు తొలగించడంతో ఇంటింటి కసువు సేకరణ బంద్ అయ్యి ఊరంతా దిబ్బగా మారిందని ఆరోపించారు. మరో కౌన్సిలర్ నాగేంద్ర మాట్లాడుతూ మ్యాన్‌హోల్ వేయడానికి ఆరు నెలలుగా అధికారులను అడుగుతున్నా పట్టించుకునే నాధుడేలేడన్నారు. సమావేశంలో వైసీపీ కౌన్సిలర్ల ప్రశ్నలకు టీడీపీ కౌన్సిలర్ స్పందించలేదు. పైగా చాలా మంది టీడీపీ కౌన్సిలర్లు సభ జరుగుతుండగానే వెళ్లిపోయారు. అధికారులు కూడా వైసీపీ కౌన్సిలర్ల ఆరోపణలకు దీటైన సమాధానం ఇవ్వలేకపోయారు. అజెండాలోని అంశాలపై పెద్ద చర్చలేకుండానే ఆమోదించారు.

కుక్కల బారి నుంచి రక్షించాలని వినతి


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు, జూలై 30(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల బారి నుంచి పట్టణ ప్రజలను కాపాడాలని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో చంద్రమోహన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ మనుషులపై దాడి చేస్తున్నాయని, వాటిని తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజలపై పన్నులు విధించడంలో ఉన్న శ్రద్ధ కుక్కలను నియంత్రించడంలో లేదన్నారు. స్పందించిన ఆర్డీవో కుక్కల నియంత్రణకు తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షులు యువరాజు, నరసింహ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

బద్వేలు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022పీఆర్‌సీ, అరియర్సు కార్మికులకు అందించాలని, కొత్త ఆపరేటర్లకు పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని, పీల్డ్ అసిస్టెంట్లకు స్కిల్ వేతనం అందించాలని, కార్మికులకు హెల్త్ కార్డులతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మైదుకూరు డివిజన్ కార్యదర్శి కొండయ్య, యూత్ఆథయం డివిజన్ నాయకుడు నాగరాజు, కార్మిక సంఘం నాయకులు ఆయోధ్య రామయ్య, శ్రీనివాసులు, లైన్‌మెన్ గోపాల్, చెన్నక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశం

బ్రహ్మంగారిమఠం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశం ఈనెల 31న బద్వేలు పట్టణంలో జరుగుతుందని, ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాలలో ఆయన విద్యార్థులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సమావేశంలో విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం, భవిష్యత్తు పోరాటాలకు శ్రీకారం చుట్టడం, ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, మండల అధ్యక్ష కార్యదర్శులు అరవింద్, రాజశేఖర్, దేవకుమార్ పాల్గొన్నారు.

ఫంక్షన్ హాలును పరిశీలించిన కలెక్టర్


ఎస్పీతో మాట్లాడుతున్న కలెక్టర్

జమ్మలమడుగు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న నానుబాల యల్లప్ప ఫంక్షన్ హాలును బుధవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పరిశీలించారు. అక్కడ ఎస్పీ అశోక్ కుమార్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డితో సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. ఆగస్టు 1న సీఎం చంద్రబాబునాయుడు నానుబాల ఫంక్షన్ హాలులో క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఆగస్టు 15వ తేదీ నుండి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.గురుమూర్తిరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి విజయ్ వినోద్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ శిక్షణ ఇస్తామన్నారు. నూతన సాంకేతికతను ఉపయోగించి పరిశ్రమ నిపుణుల ద్వారా శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించడం శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. అర్హులు 10, ఇంటర్, డిగ్రీ పాసై 18 సంవత్సరాలు వయస్సుపైబడిన నిరుద్యోగ యువత అర్హులని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 8886297300 నంబరులో సంప్రదించాలని కోరారు.

వడ్డెరలకు 50 ఏళ్లకే పింఛను ఇవ్వాలి

అట్లూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): వడ్డెర వృత్తిదారులకు 50 ఏళ్లకే పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేయాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరగదండ రమణయ్య డిమాండ్ చేశారు. బుధవారం అట్లూరు వడ్డెర సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీలాగా వడ్డెరలకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, ప్రతి కుటుంబానికి ఇళ్లస్థలాలు, పక్కా ఇళ్లు నిర్మించాలని అలాగే రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని, వడ్డెర వృత్తిదారులకు మట్టి పని, కంకర, క్వారీల్లో పనులు చేయడంతో 50 ఏళ్లకంటే ఎక్కువ పనిచేయలేరని, అటువంటి వారికి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పనిముట్లు, 90 శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బత్తల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు ప్రింట్ మీడియా అధ్యక్షుడిగా వాసు ఏకగ్రీవం

మైదుకూరు రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గ ప్రింట్ మీడియా అధ్యక్షుడు శ్రీనివాసులు(వాసు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఏ-1 కళ్యాణమండపంలో బుధవారం నియోజకవర్గంలోని ప్రింట్ మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రస్తుతం ప్రింట్ మీడియా ఎదుర్కొంటున్న సాధకబాధకాలను చర్చించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నికల్లో జి.శ్రీనివాసులు (వాసు) నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులురెడ్డి, ట్రెజరర్‌గా చొక్కం సునీల్, ఉపాధ్యక్షులుగా కొప్పరపు వెంకటసుబ్బయ్య, పోలు సుబ్బరాయుడు, నాగేశ్వర్‌రెడ్డి, సింగ్, నాగేశ్, స్వామి, శివాజీ, రవికిశోర్, బ్రహ్మానందరెడ్డి, జగన్, సహాయకార్యదర్శులుగా సంపత్, బాబు, నాగేంద్ర, సంజీవ్, శ్రీనాథ్‌రెడ్డి, నాగముని, గంగాధర్‌రెడ్డి ఉన్నారు.